## మన్నపూర్‌లో పోషణ మాసం కార్యక్రమం

**మొగుడంపల్లి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మొగుడంపల్లిమండలం మన్నపూర్‌గ్రామంలో మంగళవారం పోషణమాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్లు సద్గుణ, విజయ హాజరై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని వివరించారు. అనంతరం పోషణమాసం ప్రాధాన్యతను వివరిస్తూ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషక వారోత్సవాలు

**గుమ్మడిదల, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
కొత్తపల్లిగ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో పౌష్టిక పోషక వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పోషకాహారం తీసుకోవడంద్వారా పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలిపారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఉపసర్పంచ్ రామేశ్వరి, వార్డుసభ్యులు లత, మధు, అంగన్‌వాడీ టీచర్ శోభతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారపదార్థాల ప్రాధాన్యతను వివరించారు. ప్రతికుటుంబం పోషకాహారంపై అవగాహన పెంచుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని వారు సూచించారు.

## శాల్గీరాలో పోషణ మహోత్సవం

**మనూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని శాల్గీరాలో మంగళవారం పోషణమహోత్సవ కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమశాఖ, సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మనూర్‌సెక్టార్ పరిధిలోని శెల్గీరాలోని అంగన్‌వాడీ 2వ కేంద్రంలో నిర్వహించిన పశుపోషణ కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాకలి శ్రీశైలం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, గర్భిణులు, బాలింతలు, బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో నమూనా పార్లమెంట్


నమూనా పార్లమెంట్ నిర్వహిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని మోర్గి గ్రామంలోని మోడల్ స్కూల్ అండ్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం పార్లమెంట్ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు నమూనా పార్లమెంట్ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపిడిఓ మహేశ్వరరావు హాజరై కార్యక్రమాన్ని పరిశీలించి విద్యార్థుల ప్రదర్శనను సమీక్షించారు. పార్లమెంట్‌లో సభనిర్వహణ, సభ్యుల బాధ్యతలు, ప్రశ్నోత్తరాలు, ప్రజాసమస్యలపై చర్చలు, నిర్ణయాలుతీసుకునే విధానాన్ని విద్యార్థులు చూడచక్కగా ప్రదర్శించారు. హెడ్‌బాయ్ నరేష్ స్పీకర్‌గా వ్యవహరించారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వాహణతో విద్యార్థుల్లో ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు అవకాశం కల్గుతుందని ఎంపిడిఓ మహేశ్వరరావు అభిప్రాయపడ్డారు.

## అంగన్‌వాడీ సిబ్బందికి ఘనసన్మానం


అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

**నర్సాపూర్ రూరల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు సేవాసంకల్ప అభియాన్‌లో భాగంగా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామంలో మంగళవారం అంగన్ మిలాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో చిన్నచింతకుంట అంగన్‌వాడీ కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులకు అంగన్‌వాడీకేంద్రాల ద్వారా విద్యాబోధనతో పాటు పౌష్టికాహారం అందించడం, వారి ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలద్వారా చిన్నారులకు పాలు, గుడ్లు, పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం, పాలు, గుడ్లు అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను గమనించడం, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించడం వంటి సేవలను అందిస్తున్న సిబ్బందిని గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు నీలి నగేష్, బిజెఎం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు భూమేష్, బాలరాజ్, మహేష్, శ్రీనివాస్, ఆంజనేయులు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**వెల్దుర్తి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన వెల్దుర్తిలోని ఉన్నతపాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు విద్యాప్రగతిని మెరుగుపరచడంతో పాటు వార్షికపరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులను ప్రారంభించినట్లు స్థానిక ఉపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం నుండి పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల అభ్యాసన స్థాయిని గుర్తించి ప్రతి సబ్జెక్టులో ముఖ్యమైన అంశాలపై ప్రత్యేకశ్రద్ధతో బోధన అందిస్తున్నామన్నారు. ఉదయం పాఠశాల సమయానికి ముందు, సాయంత్రం పాఠశాల అనంతరం నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం సాంబయ్య తెలిపారు. ప్రత్యేక తరగతులు విద్యార్థులకు సందేహనివృత్తి, పునశ్చరణ, ప్రశ్నపత్రాల వివరణ కల్పిస్తున్నామన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటూ ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, ఖదీర్ పాషా, విజయ్, శైలజ, అర్చన, రాధిక, నవనీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు..

**నర్సాపూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
నర్సాపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సిడిపిఓ హేమాభార్గవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎలిజిబుల్ జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీలలో ప్రదర్శించామని తెలిపారు. అంతేగాక ఇందులో అర్హులైన అభ్యర్థులకు కాల్ లెటర్లు అందజేశామన్నారు. అయితే అంగన్‌వాడీ టీచర్ అభ్యర్థులకు ఈ నెల 30న, ఆయా అభ్యర్థులకు అక్టోబర్ 1న నర్సాపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. అభ్యర్థులు కాల్ లెటర్‌లో పేర్కొన్న సూచనల మేరకు హాజరు కావాలని సిడిపిఓ హేమాభార్గవి సూచించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ విద్యార్థిపై సీనియర్లు ర్యాగింగ్

**-జాతీయ రహదారిపై జూనియర్లు రాస్తారోకో**
**-ర్యాగింగ్‌కు కారణమైన ఇద్దరు విద్యార్థులపై వేటు**


జాతీయ రహదారి 161 పై బైఠాయించిన విద్యార్థినులు

**చౌటకూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
సుల్తాన్‌పూర్ జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిపై సీనియర్ల ర్యాగింగ్‌కు పాల్పడిన సంఘటన తీవ్ర కలకలంరేపింది. ఈసంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని రోజులుగా జెఎన్టీయు కళాశాలలో నిర్వహించతలపెట్టిన ఫ్రెషర్స్ డే సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన రెండవసంవత్సరం విద్యార్థులు సమావేశం నిర్వహించుకున్నారు. బిటెక్ ద్వితీయ సంవత్సరం మెకానికల్ విద్యార్థులకు, ఈఈఈ విద్యార్థులకు మధ్య మాటామాట పెరిగి స్వల్పంగా గొడవ జరిగింది. ఫ్రెషర్స్ డే నిర్వహణకు సంబంధంలేని నాలుగో ఏడాది మెకానికల్ చదువుతున్న విద్యార్థులు కల్పించుకుని ఈఈఈ విద్యార్థి రుత్విక్‌పై సోమవారం దాడిచేశారు. రుత్విక్ గొంతు నులుమడంతో మెడపై గాయమయింది. దీంతో ఆ విద్యార్థిని సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈఘటన విషయం తెలుసుకున్న రుత్విక్ తల్లిదండ్రులు మంగళవారం ఉదయం కళాశాలకు చేరుకున్నారు. ఫ్రెషర్స్ డే నిర్వహణకు ఎలాంటి సంబంధంలేని బిటెక్ మెకానికల్ నాలుగో ఏడాది విద్యార్థులు దాడిచేయడాన్ని సీరియస్‌గా తీసుకున్న ఈఈఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థినీవిద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. మూకుమ్మడిగా తరగతులను బహిష్కరించి, కళాశాల ప్రధానద్వారం వద్దకు చేరుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది విద్యార్థులను బయటకు వెళ్లనీయకుండా గేట్లను మూసివేసి అడ్డుకున్నప్పటికీ, ప్రయోజనం లేకుండాపోయింది. సంగారెడ్డి, నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపైకి చేరుకుని బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమబ్రాంచి విద్యార్థి రుత్విక్‌ను ర్యాగింగ్‌కు గురి చేయడమే కాకుండా గొంతు పట్టుకుని హింసించారని విద్యార్థులు ఆరోపించారు. విద్యార్థినీవిద్యార్థులు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసనకుదిగడంతో సంగారెడ్డి, హైదరాబాద్, పటాన్‌చెరు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. గంటపాటు రహదారి స్తంభించిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణీకులు అవస్థలుపడ్డారు. విషయం తెలుసుకున్న జోగిపేట సిఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ నల్లా విశ్వజన్లు హుటాహుటిన జెఎన్టీయు కళాశాల వద్దకు తరలివచ్చారు. జాతీయ రహదారిని స్తంభింపజేసి నిరసన కార్యక్రమాలు చేపట్టవద్దంటూ సిఐ అనిల్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. జూనియర్‌పై దాడిచేసిన సీనియర్లపై చర్యలు తీసుకుంటేనే ఆందోళన విరమిస్తామని మొండికేశారు. ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్లపై కఠినచర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్‌చేశారు. రెండు రోజులుగా సీనియర్లు జూనియర్లను వేధింపువలకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథరాజుకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఈఈఈ విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. విధిలేని పరిస్థితుల్లోనే తాము రోడ్డెక్కాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు.

**ర్యాగింగ్‌కుపాల్పడిన ఇద్దరువిద్యారులు సస్పెండ్...**
ఈఈఈ ద్వితీయసంవత్సరం విద్యార్థి రుత్విక్‌పై ర్యాంగిగ్‌కు పాల్పడిన మెకానికల్ నాలుగో ఏడాది విద్యార్థులు బి.జ్ఞాన్‌కార్తిక్, సి.మాధవ్‌తేజలపై సస్పెన్షన్ వేటుపడింది. ఈఈఈ విద్యార్థి రుత్విక్ గొంతునులిమినట్లు ఆధారాలు స్పష్టంగా కనిపిస్తుండటాన్ని సీరియస్‌గా పరిగణించిన జెఎన్టీయు ప్రిన్సిపాల్ ఎస్.విశ్వనాథరాజు, వైస్‌ప్రిన్సిపాల్ రాఘవేందర్రావు, వివిధవిభాగాల హెచ్‌వోడీలతో సమావేశమయ్యారు. కళాశాలలో చోటుచేసుకున్న పరిణామాలపై హైదరాబాద్‌లోని జెఎన్టీయు కళాశాల ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మెకానికల్ విద్యార్థులపై సస్పెన్షన్ వేటు వేయాలని ఆదేశించడంతో యూనివర్సిటీ నిబంధనల ప్రకారం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.విశ్వనాథరాజు ప్రకటించారు. కళాశాలలో ర్యాగింగ్‌కు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలంటే కేవలం సస్పెన్షనతో సరిపెట్టకుండా క్యాంపస్‌లో యాంటీ ర్యాగింగ్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల యాజమాన్యాన్ని కోరుతున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నీట్ స్క్రీన్ టెస్ట్


నీట్ స్క్రీన్ టెస్ట్ పరీక్షను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**న్యాల్‌కల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలతో పాటు మండలంలోని హద్నూర్ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో నిర్వహించిన నీట్ స్క్రీన్ టెస్ట్ పరీక్షలు మంగళవారం ప్రశాతంగా ముగిసాయి. పరీక్షలకు 137విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 107మంది విద్యార్థులు హాజరై పరీక్షలురాశారు. విద్యార్థులు రాస్తున్న పరీక్షలను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, డిఎస్‌పి సైదానాయక్‌లు ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షాకేంద్రాల వద్ద పోలీసుల పకడ్బందీ బందోబస్తును నిర్వహించారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

**తూప్రాన్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
తుఫాన్ సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద మంగళవారం మనోహరాబాద్ గ్రామానికి చెందిన బాధితులు ఆందోళనకు దిగి ధర్నా చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మనోహరాబాద్ గ్రామానికి చెందిన మసనూరి లక్ష్మి భర్త భూమయ్య 2012లో అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. దీంతో తన భర్త పేరు మీద ఉన్న 357గజాల ఖాళీస్థలాన్ని తమ దగ్గర బంధువులు మసునూరి సత్తమ్మ కుమారుడు అప్పట్లో కార్యదర్శి సహాయంతో తూప్రాన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 2013లో గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. దాని తర్వాత మసునూరి రవికుమార్‌పై 200గజాలు, మసూనూరి భాస్కర్‌పై మరో 200గజాలు తిరిగి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఉన్న ఖాళీస్థలం 357గజాలని, రెండోసారి రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పుడు 400 చేయించుకున్నారన్నారు. ఈస్థలంపై 15 లక్షలు ప్రైవేటు ఫైనాన్స్‌లో లోన్ తీసుకున్నారని ఆరోపించారు. ఇందుకు సహకరించిన కార్యదర్శి, రిజిస్ట్రేషన్ చేసిన సబ్‌రిజిస్ట్రార్‌పై వెంటనే చర్యలు తీసుకొని తమ భూమి తమకు అప్పగించాలని, రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు.

## హిందూ సమాజానికి సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

**-బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్**


రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులు

**నర్సాపూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
హిందూ దేవుళ్లను కించపరిచేలా, హిందూ మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ డిమాండ్‌చేశారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిజెపి మెదక్‌జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు వాళ్దాస్ రాధామల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ.. హిందూధర్మాన్ని, హిందూలమనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలుచేయడం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి హిందువులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంఘసాని సురేష్, రాగి రాములు, రమేష్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, రాములునాయక్, నీలి నాగేష్, శ్రీనివాస్‌గౌడ్, నగేష్, పడిగె దాస్, హరీష్, సతీష్, నర్సింలు, జైపాల్, బాలరాజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## సర్ విషయంలో కాంగ్రెస్ తీరు సరికాదు

**-బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్**

**నర్సాపూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
సర్ విషయంలో కాంగ్రెస్ చేస్తున్న తీరు సరికాదని బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన నర్సాపూర్ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ గెలిచినచోట్ల సర్‌ప్రక్రియ మంచిది కాని, తెలంగాణలో చేస్తే మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించడం సరికాదని అన్నారు. మీకు సర్ నచ్చకపోతే కాంగ్రెస్ గెలిచిన కేరళ, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులో రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీకి రావాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీనియర్‌నాయకులు సంగసాని సురేష్, రాగి రాములు, నారాయణరెడ్డి, రమేష్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, రాములునాయక్, నీలి నాగేష్, జైపాల్, శ్రీనివాస్‌గౌడ్, నగేష్, హరీష్, పడిగె దాసు, నర్సింలు, శ్రీకాంత్, కర్రే వెంకన్న, బాలరాజ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి భగ్గుమన్నది

**-నర్సంపల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మ దగ్ధం**


సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హిందూ సమాజం పట్ల చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గుమ్మడిదల మున్సిపాలిటీ బిజెపి ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళన చేపట్టారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో బిజెపి మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సంపల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధంచేసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ప్రధానమంత్రి, హిందూసమాజం పట్ల బాధ్యతారహితంగా వ్యాఖ్యలుచేయడం సరికాదని మండిపడ్డారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం తగదని, ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి కోల్కుర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు మాలేపల్లి రాజేందర్‌రెడ్డి, ఓబిసి మోర్చా అధ్యక్షులు కోణం విఠల్‌తో పాటు కొండా లక్ష్మణ్, కౌసర్, విజయలక్ష్మి, పాలుగు గోవర్ధన్‌రెడ్డి, విజయ్, శివరాత్రి, తాళ్ల నర్సింహ, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

## అండర్-14 జట్టుకు పడకంటి శ్రీధర్ ఎంపిక

**పుల్కల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టుకు పుల్కల్ మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పడకంటి శ్రీధర్ ఎంపికయ్యారు. చిన్న వయసులోనే క్రికెట్‌లో తన ప్రతిభను చాటుకుంటూ జిల్లా జట్టులో స్థానం సంపాదించడంతో గ్రామస్థులు, కుటుంబసభ్యులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. జోగిపేటలోని అవెంజర్ క్రికెట్ అకాడమీలో గత కొంత కాలంగా శ్రీధర్ క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నారు. అకాడమీ కోచ్ శివకుమార్ మార్గదర్శకత్వంలో నిరంతరం సాధనచేస్తూ ఆటలో నైపుణ్యాన్ని పెంపొందించుకున్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో పాటు మైదానంలో ప్రతిభను ప్రదర్శిస్తూ అండర్-14 జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నారు. క్రికెట్‌పై ఆసక్తితో కఠోర సాధన చేస్తున్న శ్రీధర్‌కు జిల్లా జట్టుకు ఎంపికకావడం కీలక మైలురాయిగా నిలిచింది. కింది స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదగడం పట్ల అవెంజర్ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు సంతోషం వ్యక్తంచేశారు. శ్రీధర్ భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశాలున్నాయని కోచ్ శివకుమార్ ఆశాభావం వ్యక్తంచేశారు. యువక్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన శిక్షణ అందించడంలో అకాడమీ చేస్తున్న కృషికి శ్రీధర్ ఎంపిక నిదర్శనంగా నిలిచిందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన శ్రీధర్ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ తన ప్రతిభను చాటుకుని విజయాలు సాధించాలని తల్లిదండ్రులు ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని గ్రామస్థులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

**-మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్**


అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్

**గుమ్మడిదల, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరు చేసి, సొంతింటి కలను సాకారం చేసేలా చర్యలుచేపట్టాలని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దశరథ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్షాసమావేశం నిర్వహించారు. చైర్మన్ కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎల్1,ఎల్2 కేటగిరీలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పథకానికి దూరంకాకుండా జాబితాలను పరిశీలించి, అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణపనులు చేపట్టుకునేలా ప్రభుత్వంనుంచి రావాల్సిన నిధులు సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలని చైర్మన్ కోరారు. అర్హులైన పేదకుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంద్వారా ప్రయోజనం చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఏఈ అనూషతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పిఆర్టీయు టిఎస్ మండలశాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

**మునిపల్లి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మునిపల్లిమండల పిఆర్టీయు మండల నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఉమేష్‌లు ఎన్నికయ్యారు. మండలపరిధిలోని బుధేరా ప్రాథమికపాఠశాలలో పిఆర్టీయు టిఎస్ మునిపల్లి మండలశాఖ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024-26 కాలానికి సంబంధించిన పాత కార్యవర్గాన్ని రద్దుచేసి, 2026-28 కాలానికి నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమానికి పిఆర్టీయు టిఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు గుండు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు ఆకుల మాణయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి ఆకుల ప్రభు, గౌరవ అధ్యక్షులు డాక్టర్ తులసీరామ్ రాథోడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషిచేయాలని కోరారు.

## జెఎన్‌టియును సందర్శించిన గురుకుల విద్యార్థులు


గురుకుల పాఠశాలను సందర్శించిన విద్యార్థులు

**చౌట్కూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
చౌటకూర్ మండలపరిధిలోని సుల్తాన్‌పూర్ జెఎన్‌టియుహెచ్ ఇంజనీరింగ్ కళాశాలను ఆందోల్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు మంగళవారం సందర్శించారు. కళాశాల ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్షేత్రపర్యటనలో 79మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలోని వివిధ ఇంజనీరింగ్ విభాగాలు, ప్రయోగశాలలు, కంప్యూటర్ కేంద్రాలు, గ్రంథాలయాన్ని సందర్శించారు. కళాశాల అధ్యాపకులు, ప్రయోగశాల సహాయకులు సైన్స్ ప్రయోగాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఉన్నతవిద్యావకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విశ్వనాథ రాజు తెలిపారు. ఉన్నత విద్యాసంస్థలను ప్రత్యక్షంగా సందర్శించడం ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ పర్యటనతో ఇంజనీరింగ్ విద్యపై అవగాహన పెరిగిందని, ఉన్నతచదువులు అభ్యసించాలనే ఆసక్తి కలిగిందని విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎం.శైలజ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంకుడుగుంతలను ఏర్పాటుచేద్దాం...

**-ఎంపిడివో దామోదర్**



మాట్లాడుతున్న ఎంపిడివో దామోదర్

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
నీటివృథాను అరికట్టి ప్రతి నీటిచుక్కను ఒడిసి పట్టుకోవాలని ఎంపిడివో దామోదర్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేటలో ఈజిఎస్ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయపొలాల వద్ద నీటివృథాను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయపొలాల వద్ద నీటికుంటలను ఏర్పాటు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్‌నినోప్రభావం తీవ్రంగా ఉందని, ఇంటి పరిసరాల్లో ఇంకుడుగుంతల ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీటివృథాను అరికట్టడానికి ప్రజలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ వినోద్, ఎపివో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే సంస్థను సందర్శించిన విద్యార్థులు


డిజిటల్ సర్వే వివరాలను వివరిస్తున్న దృశ్యం

**చౌట్కూర్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:**
సంగారెడ్డిజిల్లా చౌట్కూర్ మండలపరిధిలోని సుల్తాన్‌పూర్ జెఎన్‌టియుహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు చెందిన బిటెక్ రెండవసంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు హైదరాబాద్‌లోని ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థను సందర్శించారు. కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు పారిశ్రామిక విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆధునిక సర్వేయింగ్ పద్ధతులు, మ్యాపింగ్ సాంకేతికతలు, రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థ (జిఐఎస్), డిజిటల్ మ్యాపింగ్‌పై అవగాహన పొందారు. ఆధునిక సర్వే పరికరాలు, డ్రోన్ల ద్వారా నిర్వహించే సర్వే విధానాలను పరిశీలించారు. భౌగోళిక సమాచార సేకరణ, దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సర్వే ఆఫ్ ఇండియా పోషిస్తున్న పాత్రను అధికారులు వివరించారు. తరగతిగదిలో నేర్చుకున్న సైద్ధాంతిక అంశాలను క్షేత్రస్థాయిలో అన్వయించుకోవడానికి ఈ సందర్శన ఎంతగానో ఉపయోగపడిందని సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్.విద్యావతి తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతికనైపుణ్యాలు, ప్రాయోగికపరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు పరిశ్రమలతో అనుసంధానానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమంలో విభాగాధిపతి ఎస్.విద్యావతి, అధ్యాపకులు, రవికిరణ్, ఆంజనేయులు, ఆనంద్‌తో పాటు సర్వే ఆఫ్ ఇండియా శిక్షణసిబ్బంది పాల్గొన్నారు.

## లైన్‌మ్యాన్‌ను మార్చాలని విద్యుత్ అధికారులకు వినతి


వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**చౌటకూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
చౌట్కూర్ మండలం కోర్పోల్ గ్రామ రైతులు పంటలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ విద్యుత్‌శాఖ డిఈ, ఎడిఈ, ఎఈలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. గ్రామంలో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతుండటంతో పంటలకు నీటిని అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రస్తుతం విధుల్లో ఉన్న లైన్‌మ్యాన్ సమయానికి అందుబాటులో ఉండటంలేదని, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లైన్‌మ్యాన్‌ను మార్చి రైతులకు అందుబాటులో ఉండే బాధ్యతాయుతమైన సిబ్బందిని నియమించాలని డిమాండ్‌చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోకపోతే నాలుగురోజుల అనంతరం స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను రైతులతో కలిసి ముట్టడిస్తామని, అనంతరం పెద్ద ఎత్తున రైతులతో కలెక్టరేట్‌వరకు పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. వినతిపై స్పందించిన విద్యుత్ అధికారులు రెండు రోజుల్లో ఎబిస్విచ్‌లు, బ్రేకర్లు ఏర్పాటుచేసి విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలుతీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్లమొల్ల యాదిరెడ్డి, పుట్టి మల్లేశం, మోహన్‌ముదిరాజ్ (బిజెపి మండల ప్రధానకార్యదర్శి), సంగారెడ్డి పాండు, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి కౌలాగరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్లు వెంకటరమణ, శ్రీనివాస్

## చేనేత రంగానికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం

### కార్పొరేషన్ చైర్మన్లు వెంకటరమణ, శ్రీనివాస్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** చేనేత రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హ్యాండ్లూమ్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చూడం వెంకటరమణ, పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్‌లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ చేనేత సహకార సంఘం 46వ వార్షిక సాధారణ మహాసభ పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట అంటేనే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గొల్లభామ చీరలు గుర్తుకు వస్తాయన్నారు. సిద్దిపేట ప్రాంత చేనేత కళాకారుల ప్రతిభ దేశానికే గర్వకారణమని కొనియాడారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ చర్యలు తీసుకుంటుందన్నారు. చేనేత సహకార సంఘాల్లో మౌలిక వసతుల కల్పన సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదల దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం డైరెక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును పరిరక్షించాలి : రూపేష్




మాట్లాడుతున్న సీపీఐ మండల అధ్యక్షుడు రూపేష్ తదితరులు

**బెజ్జంకి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** ఓటు హక్కును పరిరక్షించాలని, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ డిమాండ్ చేశారు. బెజ్జంకిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఎన్నికల సంఘం ఐటీ విభాగం డైరెక్టర్ జనరల్ సీమా ఖన్నాను అరెస్టు చేసి విచారించాలని ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనలు చేపడుతామన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లను తొలగింపునకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాని కోరారు. సమావేశంలో నాయకులు బోనగిరి శ్రావణ్, దొంతరవేణి మహేష్, రొడ్డ చరణ్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు కేరళ స్కూల్ విద్యార్థుల ఎంపిక




విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లాలో ఈ నెల 28న నిర్వహించిన అతీయ పటీయ సీనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో హుస్నాబాద్‌కు చెందిన కేరళ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన బి. శ్రీచరణ్ (9వ తరగతి), ఎం. లక్కీ నాయక్ (9వ తరగతి) ఫైనల్‌లో ప్రథమ స్థానం సాధించారు. వీరు అక్టోబర్ 11న జగిత్యాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్, ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను చైర్మన్, ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్, సెక్రటరీ, కరస్పాండెంట్ అల్లే శైలేందర్, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## కాలనీలకు కేటాయించిన ప్రభుత్వ స్థల సర్వే



ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ, డబుల్ బెడ్‌రూమ్ కాలనీల ప్రజల అవసరాల కోసం కేటాయించిన రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ ఆధ్వర్యంలో సర్వేయర్లతో కలిసి సర్వే నిర్వహించారు. రెండు ఎకరాల స్థలంలో ఒక ఎకరం వైకుంఠధామం, ఒక ఎకరం ఖబ్రస్థాన్ కోసం కేటాయిస్తూ సర్వేయర్ల ద్వారా పరిశీలించి హద్దులను ఏర్పాటుచేయించారు. అనంతరం కేటాయించిన స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించే ప్రక్రియను పూర్తి చేశారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**బెజ్జంకి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** జిల్లా అత్యపాత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో భావన, అమూల్య, ఇంటర్ కీర్తి ప్రసన్న, తన్మయిలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అత్యపాత్య పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ వీరలక్ష్మి తెలిపారు. సోమవారం జరిగిన జిల్లాస్థాయి ఆత్యపాత్య పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జగిత్యాల జిల్లాలో అక్టోబర్ 11,12వ తేదీలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అత్యపాత్య పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల బృందం విద్యార్థులను సత్కారించారు. కార్యక్రమంలో పీడీ శౌని, పీఈటి శ్రీలతను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ విజయ అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

# చేనేతకు చేయూత.. కార్మికులకు భరోసా !

### సంక్షేమం, పింఛన్లు, శిక్షణ.. పాపన్నపేట చేనేత సంఘం సర్వసభ్య సమావేశంలో కీలక తీర్మానాలు

**పాపన్నపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

చేనేత వృత్తిని కాపాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని పాపన్నపేట చేనేత సహకార సంఘం సభ్యులు కోరారు. మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం చైర్మన్ కొడపాక విఠల్ అధ్యక్షతన మంగళవారం సంఘం భవనంలో నిర్వహించారు. ఈసందర్భంగా కొత్తగా చేనేత సభ్యత్వాల నమోదు, వృత్తిదారులకు గుర్తింపు కార్డుల జారీ, కొత్త సభ్యులకు హస్తకళా వృత్తిలో శిక్షణ అందించాలని తీర్మానించారు. 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికుల వివరాలు సేకరించి అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. వర్షాల దెబ్బతిన్న చేనేత సంఘం భవనానికి మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే పాత భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని సభ్యులు కోరారు. భవనంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేత భవనంలో కొనసాగుతున్న ఐబెల్ వాటర్ ప్లాంట్, పోస్టాఫీస్, బట్టల దుకాణాల అద్దె బకాయిలను సెప్టెంబర్ నెలాఖరులోగా చెల్లించకపోతే ఖాళీ చేయించాలని సభ్యులు డిమాండ్ చేశారు. చేనేత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందించాలని, చేనేత వృత్తిలో కొనసాగుతున్న పద్మశాలి కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశానికి ముందు ఇటీవల మృతి చెందిన సంఘం మాజీ డైరెక్టర్లు బీకొండ నారాయణ, బద్దాపురం రాములు, పద్మశాలి కులసంఘం నాయకుడు మరెల్లి రాములుకు సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించినివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పల్లె సంగమేశ్వర, పల్లె లక్ష్మణ్, దాసరి యాదయ్య, అచుకట్ల గురునాథం, జూకంటి సంగయ్యతోపాటు సభ్యులు కల్లేటి సంగమేశ్వర, వల్లందేశీ శ్రీనివాస్, బద్దాపురం సంగమేశ్వర, పడిగే కిష్టయ్య, పోల శ్రీనివాస్, కొడపాక రాజేశ్వర్, పల్లె రామచందర్, వల్లందేశీ బుచ్చికుమార్, బీకొండ జోగయ్య, రమేష్ పాల్గొన్నారు.



పాపన్నపేట చేనేత సంఘం సర్వసభ్య సమావేశం



మునిగడపలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో వసంతరావు

## నకిలీ, కల్తీ ఎరువుల నివారణకు తనిఖీలు : ఏవో

**జగదేవ్‌పూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** ఎరువుల దుకాణాల్లో నకిలీ, కల్తీ ఎరువులను విక్రయిస్తే దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జగదేవ్‌పూర్ మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చాట్లపల్లి, వట్టిపల్లి, మునిగడప, అలిరాజపేట గ్రామాల్లోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఎరువుల డీలర్లు విధిగా స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని, నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎరువుల దుకాణాల్లోని ఉత్పత్తుల లేబుల్స్, బ్యాచ్ నెంబర్లు, భౌతిక నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నూతన కమిటీల ఎన్నిక

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. గజ్వేల్‌లోని అంబేద్కర్‌భవన్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మైస రాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ ముఖ్య అతిదిగా పాల్గొని కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షునిగా చింతకింది యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా మర్రికింది యాదగిరి, కార్యదర్శిగా నల్ల మహేష్, కార్యవర్గ సభ్యులుగా పెద్దింటి నవీన్, చింతకింది భాను, సిహెచ్.కిరణ్‌లను ఎన్నుకోగా, ఎంఎస్‌పి అధ్యక్షునిగా ఈదుగాని యాదగిరి, ప్రధానకార్యదర్శిగా పుంటికూర యాదగిరి, ఉపాధ్యక్షునిగా లక్ష్మాపురం ఈశ్వర్, కార్యదర్శిగా కుంటి యాదగిరిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా ఇంచార్జ్ సామ్రాట్ ప్రకాష్, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, గజ్వేల్ మండల ఇంచార్జ్ ఉబ్బని ఆంజనేయులు, శనిగరి రమేష్, చిట్యాల రవీందర్, బొంది స్వామి, లక్ష్మపురం కనకయ్య, కొత్తోళ్ల స్వామి, సాయిలు, శ్రీకాంత్, రాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బైరాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రి-ప్రైమరీ ప్రారంభం

**ధూళిమిట్ట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బైరాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రీ-ప్రైమరీ తరగతులను మండల విద్యాధికారి ఎ.కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి ప్రీ-ప్రైమరీ పాఠశాలలు దోహదపడతాయని తెలిపారు. గ్రామస్తులు తమ పిల్లలను ప్రీ-ప్రైమరీలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలోఓ సర్పంచ్ బర్మ రాజమల్లయ్య, యాప్ చైర్మన్ రజిత, జడ్పి హెచ్‌ఎం మహేష్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం యాదగిరి, పంచాయతీ కార్యదర్శి రాజు. ఉపాధ్యాయులు వివేక్,సురేష్, టీచర్ భవాని, ఆయా నవ్య,తల్లిదండ్రులు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంఈవో కరుణాకర్‌రెడ్డి




వర్గల్‌లో జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న కొట్టాల యాదగిరి

## సామాజిక న్యాయం టిఆర్ఎస్‌తోనే సాధ్యం

### నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టాల యాదగిరి

**వర్గల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** ప్రజలకు కావాల్సిన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి మరియు సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేన పార్టీతోనే సాధ్యమని టిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టాల యాదగిరి అన్నారు. మంగళవారం వర్గల్ మండలకేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు జరిగిన అవమానాలు, అన్యాయాన్ని గ్రహించిన కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి అధికారమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎడ్ల నర్సింలు, స్థానిక నాయకులు స్వామి, కూరాకుల శ్రీకాంత్, రాజు, చందు, కుమార్, నర్సింలు, శ్రావణ్, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు ముస్కాన్

**పటాన్‌చెరు, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు ముస్కాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ విస్తృత స్థాయి సమావేశంలో పటాన్ చెరు డివిజన్‌కు చెందిన ముస్కాన్ ను జిల్లా కమిటీ సభ్యురాలిగా నూతనంగా ఎన్నికయ్యారు. మంగళవారం పటాన్చెరు పట్టణంలోని శ్రామిక్ భవన్ లో ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముస్కాన్ డిమాండ్ చేశారు.విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో విద్యార్థుల పక్షాన పోరాడుతామన్నారు.

## పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఎనిమిది మందిపై కేసు

**తూప్రాన్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** తూప్రాన్ మండలము వెంకటాయపల్లి గ్రామంలో ఈనెల 29న డయల్100కు కాల్ రావడంతో సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి డయల్100 కాల్‌కు స్పందించి అక్కడికి వెళ్లిన పోలీస్ కానిస్టేబుల్ పై మద్యం మత్తులో ఉ జంగం నవీన్, తొంట సతీష్, తొంట అనిల్, గోలిపల్లి వెంకట్రెడ్డి, గోలిపల్లి రాజారెడ్డి, తొంట గణేష్, జంగం కిరణ్, బుర్ర వంశీగౌడ్ ఎనిమిది మంది వ్యక్తులు మద్యం పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తూ, దుర్భాషలాడుతూ, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, విధుల్లో ఉన్న సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

# అర్ధరాత్రి దాటినా ఆగని మద్యం విక్రయాలు..!?

### పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

పట్టణంలో బెల్ట్ షాపుల నిర్వహణ యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. షాపుల నిర్వాహకులు మద్యం విక్రయాలకు నిర్దేశించిన సమయాలను పట్టించుకోకుండా రాత్రి, పగలు తేడా లేకుండా విక్రయాలు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలను అమలు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ముఖ్యంగా హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డు గాంధీ చౌరస్తా పరిసరాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. అర్ధరాత్రి 12 గంటలు దాటినా మద్యం విక్రయాలు కొనసాగుతుండగా, ఉదయం 6 గంటలు కాకముందే విక్రయాలు ప్రారంభమవుతున్నాయని అంటున్నారు. దీంతో తెల్లవారు జామున నుంచే ఆ ప్రాంతంలో మద్యం కొనుగోలుదారుల రద్దీ కనిపిస్తోందని, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా.. నిర్వహిస్తే ఇంత తెల్లవారు జామున, అర్ధరాత్రి వరకు విక్రయాలు ఎలా కొనసాగుతున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ విక్రయాలపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడంలేదనే ప్రశ్నలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. మద్యం అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మామూళ్ల ఆరోపణలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, బెల్ట్‌షాపుల వెనుక ఎవరెవరి అండదండలు ఉన్నాయి, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయా లేదా అన్నదానిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారా అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని మేదావులు అనుకుంటున్నారు.



ఇటీవల బెల్ట్‌షాప్‌పై దాడులు నిర్వహించి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు (ఫైల్‌ఫోటో)

### నిబంధనలు ఉల్లంగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : గడిపె మల్లేష్

ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్ డిమాండ్ చేశారు. ఉదయం, అర్ధ రాత్రి అనే తేడా లేకుండా మద్యం విక్రయాలు జరుగుడుండడంతో యువత మద్యానికి బానిసై అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. యువత ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టంచేశారు.

### బెల్ట్‌షాపుల విషయంలో నిర్లక్ష్యం వద్దు...

#### బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి

హుస్నాబాద్‌లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్ట్ షాపుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వంనుండి ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ ప్రజల జేబులకు చిల్లులు పెట్టడంతోపాటు వారి అనారోగ్యానికి కారణమౌతున్నారన్నారు. ఈ విషయంలో అధికా రులు వెంటనే స్పందించాలని లేనిపక్షంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## జాతీయస్థాయి నేషనల్ సైన్స్ సెమినార్‌కు పూజశ్రీ ఎంపిక

**మెదక్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** మెదక్ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి సైన్సు సెమినార్లు దోహదపడతాయని రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ గాజర్ల రమేష్ అన్నారు. నేడు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో 'భారతీయ ఇంధన వనరుల సముదాయం 2047 అవకాశాలు సవాళ్లు' అనే అంశంపై విద్యార్థులు సెమినార్ పత్రాలను ప్రజెంట్ చేయడం జరిగింది. ఇందులో మొదటి స్థానం పొందిన పూజశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్లాపూర్ విద్యార్థినీ మెమెంటో నగదు పురస్కారంతో సత్కరించారు ఇదేస్ఫూర్తితో అక్టోబర్ 30న ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి సెమినార్లో రాణించాలని ఆకాంక్షించారు. పూజశ్రీని జిల్లా విద్యాధికారి రాజు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అభినందించారు

## నేడు అంగడికిష్టాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం

**మర్కుక్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ బాలయ్య తెలిపారు. గ్రామ సర్పంచ్ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉదయం 11 గంటల లోపు పోలీస్, వివిధ శాఖల అధికారులతో పాటు గ్రామ ప్రజలు హాజరుకావాలని కోరారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**బెజ్జంకి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో తిప్పారపు సురేష్, గుండారంలో బోడపట్ల మల్లయ్య, దాచారంలో మంద ఎల్లవ్వ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పిఎసిఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌తో కలిసి పరామర్శించి ఓదార్చారు.కార్యక్రమంలో డైరెక్టర్ బైర సంతోష్, దోనె వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కత్తి రమేష్,అమరాజు ప్రశాంత్,మాతంగి భాస్కర్, జెల్ల ప్రభాకర్, రావుల నర్సయ్య, బోడిగే రామచంద్రం, బోనగం రమేష్, బండి వేణు, పుల్ల పోచయ్య, పరుశరామ్,పుర్మ నారాయణరెడ్డి, గుబురే చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకిలో పోషణ మాసోత్సవం

**బెజ్జంకి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ పోషన్ అభియాన్‌లో భాగంగా ప్రతి ఏటా సెప్టెంబర్‌లో నిర్వహించే పోషణ మాసం కార్యక్రమాన్ని మంగళవారం బెజ్జంకి సెక్టార్ స్థాయిలో నిర్వహించారు. ఈ సంవత్సరం 'హమారే అంగన్‌వాడీ' హమారే జిమ్మేదారీ' అనే థీమ్‌తో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బెజ్జంకి సెక్టార్ ఐసిడిఎస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ భావన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, ఇతర లబ్ధిదారులు పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతులకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బెజ్జంకి సర్పంచ్ శ్రీధర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్, డిప్యూటీ తహాశీల్దార్ అయేషా రాఫత్,పద్మ, భాస్కర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

**చిన్నకోడూరు, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చెలకల నాగార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొచ్చగుట్టపల్లి గ్రామంలో మంగళవారం జాతీయ పోషక మాసం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడూరి రాకేష్, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ శ్యామల, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో...**

**గజ్వేల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** పోషకాహార లోపం వల్లే అనారోగ్య సమస్యలు వస్తాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో 3వ అంగన్వాడీ కేంద్రంలో పోషక మాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రామలక్ష్మి, రజిత, ఫర్జానాబేగం, పి.నాగరాణి, ఆశ వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌విఎంలో ఉచిత వైద్య శిబిరం

**ములుగు, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మంగళవారం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోగల ఆర్‌విఎం ఆసుపత్రిలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఈసిజి, టుడిఈకో, కొవ్వు పరీక్ష, ర్యాండం బ్లడ్ షుగర్ ఉచితంగా చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరం వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలతో బాధపడే చాలా మంది రోగులకు మేలు జరిగిందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ భానుకిరణ్‌రెడ్డి, గుండె వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మినారాయణ, ఆర్‌విఎం సీఈవో దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శ

**పాపన్నపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను మంగళవారం మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. గాంధారిపల్లి గ్రామంలో బిఆర్ఎస్ నాయకుడు పాశం అంజిరెడ్డి తండ్రి నాగిరెడ్డి మృతి చెందడంతో ముందుగా ఆయన కుటుంబాన్ని పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం జయపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన దాసరి కేశయ్య కుటుంబ సభ్యులను, యూసుఫ్‌పేటలో చామంతుల నారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. కుర్తివాడలో ఏడుపాయల మాజీ డైరెక్టర్ మోహనరావు అత్తమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త పుట్టి మల్లేశం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కలిసి సానుభూతి తెలిపారు. ఆమె వెంట పాపన్నపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగన్, సర్పంచ్ సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వడ్ల కుబేరుడు, మాజీ సర్పంచ్‌లు లింగారెడ్డి, బద్రి మల్లేశం, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి,నాయకులు కిష్టగౌడ్, ఆంథోనీ, అనిల్‌రెడ్డి, మల్లేశం, విశ్వాసం రెడ్డి, రఘుపతి, మన్నే వెంకటేశం, సిద్ధిరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎల్‌వోసి అందజేత

**పాపన్నపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** పాపన్నపేటకు చెందిన నిజామొద్దీన్‌కు కాలికి శస్త్రచికిత్స చేయించుకునేందుకు రూ.75 వేల ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది. కాలికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో చికిత్సకోసం ఎల్వోసీకి దరఖాస్తు చేసుకోగా రూ. 75 వేల విలువైన ఎల్వోసీ మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, సహకరించిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్,పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సుఫీ, మైనార్టీ మండల అధ్యక్షులు ఖలీం,ప్రజాప్రతినిధులు, అధికారులకు నిజామొద్దీన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## శివాలయంలో ఘనంగా హోమం

**చిన్నకోడూరు, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** మండలపరిధిలోని చంద్లాపూర్‌లో మంగళవారం శివాయంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయకుడి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ రోజాశర్మ, గ్రామస్తులు సంతోష్, శ్రీకాంత్, రవీందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, వినీష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైడేను పరిశీలించిన మండల ప్రత్యేకాధికారి

**జగదేవ్‌పూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** మండలకేంద్రంలో మంగళవారం డ్రైడేను పంచాయతీ కార్యదర్శి వికాస్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టగా మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైడేను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. ప్రతి ఇంటిలో నిల్వఉన్న నీటిని పూర్తిగా తొలగించి ప్రజలకు నిల్వఉన్న నీటితో వచ్చే అనర్థాల గురించి వివరించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తదనంతరం మండలకేంద్రంలోని కెజిబివి విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు పట్టుదలతో లక్ష్యం ఏర్పాటు చేసుకొని విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, హెల్త్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సిద్ధివినాయకుడిని దర్శించుకున్న డిసిసి అధ్యక్షులు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని రేజింతల్‌గ్రామ శివారులో స్వయంభువుగా కొలువున్న శ్రీసిద్ధివినాయక ఆలయాన్ని మంగళవారం అంగారక సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని డిసిసి అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆయాప్రాంతాలతో పాటు కర్ణాటకలోని బీదర్ పట్టణం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి పాదయాత్రగా చేరుకుని దైవదర్శనం చేసుకున్నారు.

## కెజిబివిని తనిఖీచేసిన ఎంపిడిఓ



కెజిబివిని తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ చంద్రశేఖర్

**మనూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని పుల్‌కుర్తిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికలకోసం సిద్ధంగా ఉంచిన మధ్యాహ్నభోజనాన్ని, ఉపాధ్యాయుల హాజరుపట్టికను, విద్యార్థుల హాజరును, రికార్డులను ఎంపిడిఓ పరిశీలించారు. విద్యార్థులకు ఎంపిడిఓ చంద్రశేఖర్ మధ్యాహ్నభోజనం వడ్డించి రుచిని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనందుకుని ఉన్నతులుగా ఎదగాలని ఎంపిడిఓ సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సమాచారం లేకుండా జెండా తొలగింపు తగదు

**-తహసీల్దార్‌కు కురుమసంఘం నాయకుల వినతి**



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఔదత్‌పూర్‌లో సర్వేనంబర్ 3లో ఏర్పాటు చేసుకున్న స్వాతంత్ర్య సమరయోధులు సంగోలి రాయన్న జెండాను, బీరప్ప మందిర నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం, జెండాలను ముందస్తు సమాచారం లేకుండా తొలగించడం ఏమిటని కురుమసంఘం నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం డిప్యూటీకలెక్టర్ లక్ష్మీదీపిక, డిప్యూటీ తహసీల్దార్ శివకృష్ణలకు వినతిపత్రం అందచేసి విచారణజరిపి న్యాయంచేయాలని కురుమసంఘం నాయకులు కోరారు. సర్వేనంబర్ 3లో ఇతరవర్గాలు, మతాలకు సంబంధించిన విగ్రహాలు, నిర్మాణాలు ఉన్నాయని, వాటి ఏర్పాటుకు అధికారిక అనుమతులు ఉన్నాయా, లేవా అనేది పరిశీలించాలని సంఘంసభ్యులు గుర్తుచేశారు. అనుమతులు లేనివాటిని తొలగించాల్సి వస్తే అందరికి ఒకే విధమైన నిబంధనలు వర్తింపచేయాలని డిమాండ్‌చేశారు. సమస్యకు పరిష్కారంచూపాలని, లేకుంటే ప్రజాస్వామ్యబద్ధంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని కురుమసంఘం సభ్యులు హెచ్చరించారు.

## మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

**-ఎంపి సురేష్ శెట్కార్‌కు కాంగ్రెస్ నేతల వినతి**



ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌కు వినతిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన నాగల్‌గిద్దతోపాటు ఆయా గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులనుకేటాయించాలని కాంగ్రెస్‌పార్టీ మాజీమండలాధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్ జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌కు వినతిచేశారు. హైద్రాబాద్‌లోని ఎంపి శెట్కార్ నివాసంలో మండల కాంగ్రెస్ నేతలతో కలిసి ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం అందచేశారు. మండలంలోని పలుగ్రామాల్లో రహదారులు, తాగునీరు, తదితర మౌలిక వసతులను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని మాణిక్‌రావు గుర్తుచేశారు. మండల అభివృద్ధికిచేసిన వినతికి ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ సానుకూలంగా స్పందిస్తూ గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ చేసినట్లు ఈ సందర్భంగా మాణిక్‌రావుపాటిల్ గుర్తుచేశారు.

## ప్రజావాణికి అధికారుల డుమ్మా!

**-10:45 అయినా ఆరుశాఖల అధికారులే హాజరు**
**-ప్రజా సమస్యలపై ఇదేం నిర్లక్ష్యం?**



ప్రజావాణికి హాజరైన అధికారులు

**చౌటుప్పల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారుల సమయపాలన కరువైంది. ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు నిర్వహించాల్సిన ప్రజావాణికి ఉదయం 10:45 గంటలైనా పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాలేదు. చౌటుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఐకెపి, బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ, పశుసంవర్ధక ఆయుర్వేద మండల ప్రజాపరిషత్‌శాఖలకుచెందిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజాసమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం కనిపించింది. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణికి వస్తుంటారు. సమస్యలపై వినతులు సమర్పించేందుకు వచ్చే ప్రజలకు అధికారులు సమయానికి అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. అయితే కార్యక్రమం ప్రారంభమై 45నిమిషాలు గడిచినా చాలాశాఖల అధికారులు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, ఎంపిడివో శంకర్ అడిషనల్ పీడీ వస్తున్నారని, తాను శివంపేటలో ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. మండలస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహించే కార్యక్రమానికి సంబంధిత అధికారులు సమయానికి హాజరుకాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులే ఆలస్యంగా వస్తే ప్రజలకు సకాలంలో న్యాయం ఎలా జరుగుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్ణీత సమయానికి అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పిఏసిఎస్ చైర్మన్‌కు ఆరోపణల నుంచి విముక్తి

**-నిధుల దుర్వినియోగం ఆరోపణలు రుజువు కాలేదని అధికారుల తేల్చివేత**
**-సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి**

**టేక్మాల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) అధ్యక్షుడు కె.యశ్వంత్‌రెడ్డిపై వచ్చిన నిధుల దుర్వినియోగం ఆరోపణలు రుజువుకాలేదని అధికారులు తేల్చారు. ఆయనపై ఎలాంటి సర్‌చార్జ్ బాధ్యత లేదని స్పష్టంచేస్తూ సిద్దిపేటజిల్లా సహకార అధికారి, ప్రత్యేక కేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ తుది ఉత్తర్వులు జారీచేసింది. రైతుల వాంగ్మూలాలు, అఫిడవిట్లను పరిశీలించగా, నిబంధనల ప్రకారం 10శాతం వాటా మూలధనం మాత్రమే వసూలు చేసినట్లు విచారణలో తేలినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదనపు వసూళ్లతో అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డికి ప్రత్యక్ష సంబంధంలేదని, ఆ మొత్తాన్ని ఆయన వ్యక్తిగతంగా స్వీకరించినట్లు ఎలాంటి పత్రరూప, మౌఖిక ఆధారాలు లభించలేదని విచారణలో వెల్లడైంది. తెలంగాణ సహకార సంఘాల చట్టం1964లోని సెక్షన్ 60 ప్రకారం సెక్షన్ 51 విచారణ నివేదిక, సంబంధిత రికార్డులు, సాక్షుల వాంగ్మూలాలు, అధ్యక్షుడు సమర్పించిన వివరణలను అధికారులు పరిశీలించారు. సొసైటీకి నష్టం కలిగించేలా ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో నిధుల దుర్వినియోగం చేసినట్లు రుజువుకాలేదని నిర్ధారించారు. దీంతో యశ్వంత్‌రెడ్డిపై సర్‌చార్జ్ బాధ్యతను తొలగిస్తూ తుది ఉత్తర్వులు జారీచేసినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం టేక్మాల్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటుసమావేశంలో సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ నిజం నిప్పులాంటిదని అది దాచినా దాగదని, ఆలస్యంగానైనా విచారణలో ఆరోపణలన్నీ అవాస్తవాలేనని తేలిందన్నారు. రాజకీయపరంగా ఆరోపణలు సహజమేనని అన్నారు. నిజం నిలకడగా తెలుస్తుందన్నారు.



సమావేశంలో పాల్గొన్న సహకార సంఘ సభ్యులు

ఇకనైనా టేక్మాల్ ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరస్పర విభేదాల కారణంగా సొసైటీ రికవరీ తగ్గి నష్టాల బాట పడుతోందని పేర్కొన్నారు. తనపైచేసిన ఆరోపణలన్నీ నిరాధారంగా ఉన్నాయని సిద్దిపేట జిల్లా సహకార అధికారి, ప్రత్యేకకేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ తుది ఉత్తర్వులు వెల్లడించాయన్నారు. 2025 జనవరిలో పిఏసిఎస్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించిన శివకృష్ణను ఇన్‌చార్జి సిఈఓ విధుల నిర్వహణపై సభ్యులు, డైరెక్టర్లు ప్రశ్నలు లేవనెత్తారు. ఎలాంటి అనుమతిలేకుండా విధులకు గైర్హాజరైన అంశంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని వారు కోరారు. సొసైటీని మరింత అభివృద్ధి చేసేందుకు పెట్రోల్ బంక్‌ను లీజుకు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని, అలాగే వరి కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించాలని డైరెక్టర్లు సూచించారు. సొసైటీ ఆదాయాన్ని పెంచడంతోపాటు రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా పిఏసిఎస్ కార్యకలాపాలను విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ వెంకయ్య, డైరెక్టర్లు కిషన్, శ్రీరాములు, సిఈఓ సాయిలు, వేణుగోపాల్‌తో పాటు సహకారసంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పాతాళగంగలో పూజాపుష్పాలు, పత్రి నిమజ్జనం



పాతాళ గంగలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
శ్రావణమాసం సందర్భంగా సదాశివపేటలోని బసవేశ్వర మందిరంలో శివునికి, గణపతికి భక్తిశ్రద్ధలతో సమర్పించిన పూలు, పత్రిని శ్రీశైలంలోని పాతాళగంగలో నిమజ్జనంచేశారు. ఈసందర్భంగా సదాశివపేట వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు గందిగారాజు మాట్లాడుతూ, గత పెద్దలు పాటించిన సంప్రదాయాలను గత 43 సంవత్సరాలుగా కొనసాగిస్తూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బసవేశ్వర మందిరంలో పూజించిన పూలు, పత్రిని శ్రీశైలంలోని పాతాళగంగకు తీసుకెళ్లి నిమజ్జనం చేసినట్లు తెలిపారు. శ్రావణమాసంలో నిర్వహించే ఈ కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పూర్వీకుల ఆచారసంప్రదాయాలను భావితరాలకు కొనసాగించేందుకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్రాది రచన్న, వీరమహేందర్, రమేష్, రవి, సురేష్, వైద్యు, వీరు, వినోద్, విశ్వనాథ్, నాగేష్, శేఖర్, నాగేష్, నర్సింలు, కిరణ్ వీరేందర్ వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సైక్లింగ్



సైక్లింగ్ ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

**సదాశివపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
వరల్డ్ హార్ట్ డే సందర్భంగా బాలాజీ హాస్పిటల్స్ సంగారెడ్డి ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో సైక్లింగ్‌ర్యాలీతోపాటు గుండె ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా గుండె సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. అనంతరం బాలాజీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బసవ సేవాసదన్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. వారందిస్తున్న సేవలను పరిశీలించిన ఆయన బాలాజీహాస్పిటల్స్ యాజమాన్యం, వైద్య బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ, కమిషనర్ శివాజీ, వైస్‌చైర్మన్ రేణుక, కౌన్సిలర్లు, బాలాజీ హాస్పిటల్స్ మేనేజింగ్‌డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మహేష్, క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ అక్బర్, డాక్టర్ సందీప్, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ శంకర్‌నారాయణ, ఫిజిషియన్ డాక్టర్ అల్ఫియా రేచల్, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ దేవాలయానికి నూతన కమిటీ

**మొగుడంపల్లి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మొగుడంపల్లి మండలకేంద్రంలోని శ్రీరేణుకఎల్లమ్మ దేవాలయ నూతనకమిటీ ఎన్నిక ఆదివారం ఆలయప్రాంగణంలో నిర్వహించి, నూతనకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీచైర్మన్‌గా ఉల్లిగడ్డి రవికాంత్, ఉపాధ్యక్షుడిగా బోయిని రాములు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు, సర్పంచ్ రాజు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధికి గతంలో సేవలందించిన కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను సైతం ఘనంగా సత్కరించారు. నూతనకమిటీ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని గ్రామపెద్దలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టా భూమిలో మరుగుదొడ్ల నిర్మాణం ఆపాలి

**-ప్రజావాణిలో అధికారులను కోరిన లబ్ధిదారులు**



ప్రజావాణిలో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**చౌటకూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
చౌటకూర్‌లోని సర్వే నంబర్ 1633లో పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణం పట్టాదారులు అభ్యంతరం వ్యక్తంచేశారు. సోమవారం ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఈమేరకు తహసీల్దార్ అనుదీప్, ఎంపివో సువర్ణలకు వినతిపత్రం అందజేశారు. 1633 సర్వే నంబరులో తమకు హక్కులు గల పట్టా భూమిలో పంచాయతీ పాలకవర్గం వీబీజీరాంజీ పథకం కింద మంజూరైన నిధులతో ప్రజావసరాల నిమిత్తం మరుగుదొడ్ల నిర్మాణపనులు చేపడుతున్నారంటూ ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారులు స్థలాన్ని పరిశీలించి, భూమిహక్కులు, రికార్డులను పూర్తిగా పరిశీలించిన అనంతరం నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. పంచాయతీ పాలకవర్గం సర్వే నంబర్ 1633కు సంబంధించిన భూరికార్డులు పట్టాదారుహక్కులు, స్థలంహద్దులను పరిశీలించకుండా నిర్మాణపనులు కొనసాగిస్తే భవిష్యత్తులో వివాదాలకు దారితీసే అవకాశం ఉందని పట్టాదారులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈసర్వేనంబరులో గౌని పోచమ్మ, మాణెమ్మ, మల్లయ్య, దుర్గయ్య, కాశయ్య, రామయ్య, కిరణ్‌లకు పట్టాలున్నాయన్నారు. పట్టాభూమి విషయంలో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటినిర్మాణాలు చేపట్టకుండా చర్యలుతీసుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రజావసరాల కోసం మరుగుదొడ్లు నిర్మించాలనుకుంటే ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పనులు చేపట్టాలని బాధితులు సూచించారు.

**చక్రియాలలో త్రీ ఫేజ్ లైన్ ఏర్పాటుచేయండి...**
చక్రియాల గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో త్రీ ఫేజ్ విద్యుత్ లైన్‌ను ఏర్పాటుచేయాలని ట్రాన్స్‌కో అధికారులను సర్పంచ్ చిన్నరోళ్లపాటి అనసూయరాజశేఖర్ కోరారు. గ్రామంలోని వివిధ కాలనీలు, ప్రాంతాల్లో మొత్తం 800 మీటర్ల త్రీ ఫేజ్ విద్యుత్ వైర్ అవసరమని ఆమె కోరారు.

## రూ.2,05,000 పలికిన గణేశ్ లడ్డూ

**గుమ్మడిదల, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
గుమ్మడిదలమండలం అనంతారంగ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో 36వ వార్షికవేడుకల్లోభాగంగా కొలువుదీరిన గణనాథుని లడ్డూ వేలంపాటలో గోసుకొండ వెంకటరెడ్డి కుమారులు గోసుకొండ బుచ్చిరెడ్డి, దయాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డిలు కలిసి రూ.2,05,000కు లడ్డూను సొంతం చేసుకున్నారు. అదేవిధంగా స్వామివారికలశాన్ని జికెఆర్ గార్డెన్స్ యజమాని గోసుకొండ రామకృష్ణరెడ్డి రూ.51,000కు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానంద యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# గత పాలకుల పాపాలే నేటి నిరసనలు

**-అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**



అర్హులకి పట్టాలు అందిస్తున్న దృశ్యం

**మెదక్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
మెదక్ గత పదిసంవత్సరాల బిఆర్‌ఎస్ పాలనలో ప్రజలను మాయమాటలు, మోసపూరిత హామీలతో ఓట్లు దండుకున్నారని, అర్హులకు ఇళ్లు ఇవ్వకుండా తీవ్ర అన్యాయంచేశారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. వెయ్యిమంది ఉన్నచోట కేవలం పది, పదిహేను డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో అర్హులను పక్కనపెట్టి, పైసలు తీసుకుని ఉన్నవాళ్లకే ఇళ్లను పంపిణీ చేశారని, బిఆర్‌ఎస్ చేసిన ఈ అరాచకాన్ని స్వయంగా కెసిఆర్ సొంతకూతురే బయటపెట్టిందని గుర్తుచేశారు. దళితబంధు కూడా ఊరికి ఒకరిద్దరికే ఇచ్చి అందరినీ మోసంచేశారని తెలిపారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని తీవ్ర అప్పులపాలు చేసి, ఒక్కొక్కరి నెత్తిపై రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు అప్పులభారం మోపారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతుందని, మహిళలు, యువకుల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి, సేవాకార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామని స్పష్టంచేశారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం వంటి అనేక సంక్షేమపథకాలను ఇప్పటికే విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ఈరోజు ఇందిరమ్మ ఇళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఉన్న కోపాన్ని, ఆపదేళ్లలో ఇళ్లు రాలేదన్న బాధను తమ ప్రభుత్వంపై చూపించడం న్యాయం కాదని హితవు పలికారు. పదేళ్లలో జరగని నష్టాన్ని ఈ రెండున్నర ఏళ్లలోనే పూర్తిచేయడం సాధ్యమా? అని ప్రశ్నించారు. గతంలో మంత్రులు ప్రజలకు కనీసం అందుబాటులో ఉండేవారుకాదని, కాని నేడు తాము నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని చెప్పారు. జర్నలిస్టు కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం పూర్తిచేశామని ఉదాహరించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎవ్వరికీ రూపాయి కూడా లంచం ఇవ్వొద్దని, అధికారులకుగాని, కౌన్సిలర్లకుగాని, ఏ నాయకుడికీ డబ్బులు చెల్లించవద్దని విజ్ఞప్తిచేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తి పారదర్శకంగా, నిజాయితీగా ఇళ్లు పంపిణీచేస్తామని, ప్రజలెవ్వరూ అధైర్యపడవద్దని, కాంగ్రెస్‌ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## బసయ్యస్వామికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే



బసయ్యస్వామిచిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండలకేంద్రమైన న్యాల్‌కల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మఠం శివశంకరయ్యస్వామి సోదరుడు మఠం బసయ్యస్వామి చిత్రపటానికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు నివాళి అర్పించారు. బసయ్యస్వామి మృతిచెందినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం న్యాల్‌కల్‌లోని మఠం బసయ్యస్వామి నివాసానికి చేరుకుని బసయ్యస్వామి చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు.

మండలపరిధిలోని చాల్కిగ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జి.తుకారాం మృతిచెందినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తుకారాం నివాసానికి చేరుకుని తుకారాం చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి ప్రకటించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు వెంట బిఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షులు ఎల్‌చెల్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవికుమార్, మారుతి, నాయకులు సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, అశోక్, కైరత్ పటేల్, అంజి, శ్రీనివాస్‌రెడ్డి, దత్తు తదితరులు ఉన్నారు.

## యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

**-పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌కుమార్**



అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అభినాష్‌వర్మ

**న్యాల్‌కల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
చెరుకు పంట అధిక దిగుబడికి తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై మండలంలోని బసంత్‌పూర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయకుమార్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలపరిధిలోని మామిడ్గిరైతువేదికలో రైతులకు చెరుకు పంట యాజమాన్య పద్ధతులు, నానో ఎరువుల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త ఎం.విజయకుమార్ మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వినియోగం, శాస్త్రీయపంట ఉత్పత్తి పద్ధతులను, జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. ఎడిఎ డాక్టర్ డి.వైద్యనాథ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరిస్తూ జీవ ఎరువులు, జీవ పురుగుమందుల వినియోగం, వాటి ప్రయోజనాలు, పంటల్లో వాటి అనువర్తన విధానాలపై రైతులకు అవగాహనకల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఎన్.అభినాష్ వర్మ మాట్లాడుతూ రైతులకు ఎరువుల బుకింగ్‌యాప్ వినియోగం విధానాన్ని వివరించారు. వ్యవసాయశాఖ అమలుచేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, రైతులకు అందుబాటులో ఉన్న ప్రయోజనాలపై వివరించారు. శాస్త్రీయ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను పాటించడంతో పంటల ఉత్పాదకత పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయకుమార్, ఎడిఎ డాక్టర్ డి.వైద్యనాథ్, మండల వ్యవసాయ అధికారి ఎన్.అభినాష్‌వర్మ, ఏఈఓలు రమేష్‌పాటిల్, సనిత్‌రెడ్డి, సర్పంచ్ జగన్నాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విఘ్నేష్, మాతూర్ చక్కెర కర్మాగారం ఫీల్డ్ అసిస్టెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌ను సందర్శించిన విద్యార్థులు



విద్యార్థులు నేషనల్‌రిమోట్‌సెన్సింగ్ సెంటర్‌ను సందర్శించిన దృశ్యం

**కంది, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 4వ సంవత్సరం విద్యార్థులు 57మంది విద్యార్థులు మంగళవారం హైద్రాబాద్‌లోని జీడిమెట్లలోని నేషనల్ రిమోటల్ సెన్సింగ్ సెంటర్‌ను నేల, నీటి సంరక్షణ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విజిట్‌చేశారు. నీటిసంరక్షణ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ ఎన్.గంగాధర్, డాక్టర్ బి.రమ్య, డాక్టర్ వినోద్‌కుమార్‌లు విద్యార్థులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులకు రిమోట్ సెన్సింగ్, జిఐఎస్, ఉపగ్రహ చిత్రాలు, వ్యవసాయంలో అంతరిక్ష సాంకేతికత వినియోగం, సహజవనరుల నిర్వహణ తదితర అంశాలపై నిపుణులు ప్రాయోగిక అవగాహన కల్పించారు. ఎన్ఆర్ఎస్‌సి-ఇస్రోలోని వివిధ సాంకేతిక సదుపాయాలను విద్యార్థులు సందర్శించి, ఉపగ్రహడేటా వినియోగం, రిమోట్ సెన్సింగ్, జిఐఎస్ సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఎక్స్‌పోజర్ విజిట్ విజయవంతంగా ముగిసేందుకు ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.స్వామి తనవంతు సహకారం అందచేశారు. విద్యార్థులకు తరగతిగది బోధనలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రాయోగిక అనుభవం కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని డాక్టర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు.

## ఎరువులు, పురుగుమందులు అందుబాటులోకి తెస్తాం

**-సొసైటీ చైర్మన్ అరిగే రమేష్‌కుమార్**



రైతులతో మాట్లాడుతున్న సొసైటీచైర్మన్ అరిగే రమేష్‌కుమార్ దృశ్యం

**కొల్చారం, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు శుభవార్త అందింది. రూ.4 కోట్ల వ్యయంతో 5వేల మెట్రిక్‌టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం మంజూరైనట్లు సొసైటీ చైర్మన్ అరిగే రమేష్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా రైతుల సౌలభ్యం కోసం సహకార సంఘం ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుమందులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మంగళవారం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అరిగే రమేష్‌కుమార్ అధ్యక్షతన మహాజన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలక మండలి సభ్యులు, డైరెక్టర్లు, రైతులు తదితరులు హాజరై పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.